సదరం శిబిరాల షెడ్యూల్ విడుదల

సంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : సదరం శిబిరాల నిర్వహణ షెడ్యూల్‌ను సంగారెడ్డి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ సోమవారం ఓ ప్రకటనలో విడుదల చేశారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 8, 13, 16, 20, 23, 27, 30 తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఫోన్‌కు మెసేజ్ వచ్చిన వారే శిబిరానికి హాజరుకావాలన్నారు. క్యాంపునకు వచ్చేవారు స్లాట్ పేపర్, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌ఫొటో, మెడికల్ రిపోర్ట్స్ తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు.

భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి



భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సును కలెక్టర్‌తో కలిసి ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న నిర్మలా జగ్గారెడ్డి

కొండాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టం అమలు రెవెన్యూ సదస్సులో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. కొండాపూర్ మండలం తొగర్‌పల్లి, ఆలీయబాద్ గ్రామాల్లో సోమవారం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల భూసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అన్నివర్గాల పేదలకు లబ్ధి చేకూరుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మకమిటీ, మార్కెట్ కమిటీ చైర్మన్లు ప్రభు, కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీరంగూడలో 'రామ్‌రాజ్' కాటన్ షోరూం



రామ్‌రాజ్ షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

సంగారెడ్డి, మే 5 (ఆంధ్రజ్యోతి): వస్త్ర ప్రపంచంలో ప్రసిద్ధి చెందిన 'రామ్‌రాజ్' కాటన్ షోరూం సంగారెడ్డి జిల్లా బీరంగూడలోని భ్రమరాంబికనగర్‌లో ఏర్పాటైంది. ఈ షోరూంను ఆదివారం రాష్ట్ర మాజీ ఎలక్షన్ కమిషనర్ సి.పార్థసారథి లాంఛనంగా ప్రారంభించగా, ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకటరెడ్డి దీపప్రజ్వలన గావించారు. సఫాల ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రెసిడెంట్ సీఈవో పైడి ఎల్లారెడ్డి తొలి కొనుగోలును స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. తాము బాక్టీరియా, వైరల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి కాపాడేందుకు కొత్తగా యాంటీ బాక్టీరియల్ ధోతీలను ఆవిష్కరించినట్లు వివరించారు. నిపుణులచే రూపొందించబడిన మెత్తటి కాటన్‌తో తయారుచేయబడిన రామ్‌రాజ్ కాటన్ వస్త్రాలు దేశవ్యాప్తంగా అందుబాటులో వున్నట్లు పేర్కొన్నారు. దక్షిణ భారతదేశంలోని ప్రధాన నగరాలు, విమానాశ్రయాలలో తమ షోరూంలు తెరవబడుతున్నాయని తెలిపారు. రామ్‌రాజ్ కాటన్ ధోతీ, చొక్కా, బనియన్లు షోరూంలలోనే కాకుండా ప్రముఖ టెక్స్‌టైల్ షోరూంలలో కూడా అందుబాటులో వున్నట్లు వివరించారు.



జిన్నారంలో ప్రారంభానికి సిద్ధమైన సివిల్ కోర్టు భవనం

ప్రజల చెంతకే న్యాయసేవలు

జిన్నారంలో సిద్ధమైన సివిల్ జడ్జి కోర్టు భవనం

మూడు మండలాలు, 4 పీఎస్‌ల పరిధిలోని కేసుల విచారణ ఇక్కడే

జిన్నారం, మే, 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జిన్నారంలో నూతన న్యాయస్థానం సేవలు అందించేందుకు సిద్ధమైంది. మండలానికి మంజూరైన జూనియర్ సివిల్ జడ్జి కమ్ జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు తాత్కాలిక భవనంలో రూ. 8.4 లక్షలతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. త్వరలోనే కోర్టు సేవలు అందుబాటులోకి రానున్నాయి. మండల కేంద్రం జిన్నారంకు మంజూరైన కోర్టులో జిన్నారం, గుమ్మడిదల, హత్నూర మండలాలు వాటి పరిధిలోని నాలుగు పీఎస్‌ల పరిధి కేసుల విచారణ జరుగనున్నది. గతంలో జిన్నారం మండలం నర్సాపూర్ కోర్టు పరిధిలో ఉండగా.. జిల్లాల విభజనతో మండలం సంగారెడ్డి కోర్టు పరిధిలో చేరింది. మండల వాసులకు తీవ్ర దూర భారంతో ఇక్కట్లు ఉండేవి. దీంతో కొత్త కోర్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అమోదం తెలుపటంతో జిన్నారం కోర్టులో త్వరలోనే సేవలు ప్రారంభం కానున్నాయి. మండల మహిళా సంఘాల భవనాన్ని తాత్కాలిక కోర్టు కోసం ఎంపిక చేశారు. ఆర్‌అండ్‌బీ శాఖ మంజూరు చేసిన రూ. 8.4 లక్షలతో ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు, కేసుల విచారణ హాల్‌తో పాటు పెయింటింగ్ పనులు పూర్తి చేశారు. న్యాయ సేవలు అందుబాటులోకి రావడంతో మూడు మండలాల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

యూనిట్‌కు ముగ్గురు!

రాజీవ్ యువ వికాసంకు పోటాపోటీ

- మెదక్ జిల్లాకు 10,623 యూనిట్లు..
- దరఖాస్తులు 33,063
- కొనసాగుతున్న పరిశీలన
- నెలాఖరుకు లబ్ధిదారుల ఎంపిక
- జూన్ 2న మంజూరు పత్రాలు

మెదక్ అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సర్కార్ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, వ్యాపార అవకాశాల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి మెదక్ జిల్లాలో దరఖాస్తులు వెల్లువెత్తాయి. జనాభా ప్రతిపాదికన జిల్లాకు ప్రభుత్వం 10,623 యూనిట్లు మంజూరు చేసింది. ఇందుకోసం 33,063 దరఖాస్తులు వచ్చాయి. ఒక్కో యూనిట్‌కు సగటున ముగ్గురు సగటున పోటీపడుతున్నారు.

తీవ్రమైన పోటీ

ఆర్థిక సాయం, రుణాలు, సబ్సిడీలు అందించే ఈ పథకానికి భారీ స్పందన లభించింది. గత నెల ఏప్రిల్ 14న దరఖాస్తుల స్వీకరణ ముగియగా.. క్షేత్రస్థాయి పరిశీలన కొనసాగుతోంది. మెదక్ జిల్లాలో వర్గాల జనాభా ఆధారంగా యూనిట్లను కేటాయించారు. బీసీ శాఖ ద్వారా 20,238 దరఖాస్తులకు 4,589 యూనిట్లు, ఎస్సీ శాఖ 6,711 దరఖాస్తులకు 3,489 యూనిట్లు, ఎస్టీ శాఖ 3,884 దరఖాస్తులకు 2,103 యూనిట్లు, మైనారిటీ శాఖ 2,230 దరఖాస్తులకు 505 యూనిట్లు కేటాయించారు. మండలాలవారీగా బ్యాంకులు యూనిట్లు అందజేస్తాయి. ఒక రేషన్‌కార్డుపై ఒకరికి మాత్రమే రాయితీ రుణం అందుతుంది. బహుళ దరఖాస్తులు వస్తే.. కార్డు హోల్డర్‌తో సంప్రదించి ఒక దరఖాస్తును పరిగణిస్తారు.



ముమ్మరంగా ఎంపిక ప్రక్రియ

దరఖాస్తుల పరిశీలనకు జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, డీఆర్డీఏ పీడీ కన్వీనర్‌గా, శాఖలు, బ్యాంకు అధికారులు సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది. మండల స్థాయిలో ఎంపీడీవో, మున్సిపల్ పరిధిలో కమిషనర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లాలో దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. పరిశీలన, లబ్ధిదారుల ఎంపిక ఈ నెలలో పూర్తి కానుంది. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగలు, నిరుద్యోగులకు ప్రథమ ప్రాధాన్యం ఇవన్నుట్లు తెలిసింది. జూన్ 2న రాష్ట్ర అవిర్భావ దినోత్సవం సందర్భంగా లబ్ధిదారులకు ఎంపిక పత్రాలు అందజేయనున్నారు.

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

రాజీవ్ యవ వికాసానికి వచ్చిన దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. మండల కమిటీలు పరిశీలించి, జిల్లా కమిటీకి పంపుతారు. ఈ నెఖారు వరకు అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి, జూన్ 2న మంజూరు పత్రాలు అందజేస్తారు.

-జెమ్లానాయక్, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి



నిజాంపేటలో రాలిన మామిడికాయలు

అకాల కష్టం

- సిద్దిపేట జిల్లాలో 9,368 ఎకరాల్లో పంట నష్టం
- మెదక్ జిల్లాలో 500 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

7



గడిపెద్దాపూర్‌లో రాలిన వడ్లు

యూనిఫాం.. ఇక కొత్తగా!

- ప్రభుత్వ పాఠశాలల ఏకీకృత దుస్తుల డిజైన్లలో మార్పులు
- ప్రతీ విద్యార్థికి కచ్చితమైన కొలతల సేకరణ
- బాలబాలికలకు వేర్వేరు మోడల్స్
- ఒక్కో జతకు కుట్టు కూలీ రూ.75లు
- మెదక్ జిల్లాలో 74,265 మంది విద్యార్థులకు రెండేసి జతలు

మెదక్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 2025-26 విద్యాసంవత్సరం నుంచి అందజేసే ఏకీకృత దుస్తుల రూపం మారనుంది. పాఠశాలల్లో చదివే విద్యార్థుల యూనిఫాం తయారీలో రాష్ట్రంలోని ప్రభుత్వం ఈసారి మార్పులు తీసుకొచ్చింది. కచ్చితమైన కొలతలతోనే యూనిఫాం దుస్తులు అందించాలని నిర్ణయం తీసుకుంది. టైలర్లు సగటు కొలతలకు బదులు అంతేకాక ప్రతీ విద్యార్థి కొలతలనూ వ్యక్తిగతంగా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు పాఠశాల విద్యా డైరెక్టరేట్ గత నెలలోనే ఉత్తర్వ్యులు వెలువరించింది. జిల్లాలోని విద్యాశాఖ కచ్చితంగా ఉత్తర్వ్యులు పాటించాలని ఆదేశించింది. ఇందులో తరగతులవారీగా బాలబాలికలకు వేర్వేరు డిజైన్లలో దుస్తులు కుట్టించి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంతో టైలర్లకు కూలీ గిట్టుబాటయ్యే అవకాశం ఉంది. షర్టులు, లాంగ్ ఫ్రాక్‌లకు పట్టీలు, భుజాలపైన కప్స్ వంటి ప్యాచ్ వర్క్ లేకండా సాధారణ యూనీఫారాలను డిజైన్ చేశారు.

6, 7 తరగతులకూ ప్యాంట్లు

ఈసారి ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు గతంలో నిక్కర్లు ఇవ్వగా ఈసారి నుంచి నిక్కర్లకు బదులు ప్యాంట్లు ఇవ్వనున్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు పని సులభతరంగా ఉంటుంది. అంతే కాకండా సకాలంలో దుస్తులను విద్యార్థులు పంపిణీ చేసేందుకు వీలవుతుందని అభిప్రాయ పడుతున్నారు. యూనిఫారాల డిజైన్లు ఎలా ఉండాలో సూచిస్తూ విద్యాశాఖకు రాష్ట్ర ఉన్నతాదికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

సగటున 50 సెంటీమీటర్లు

ప్రతీ విద్యార్థికి సగటున 50 సెంటీమీటర్ల వస్త్రం సరఫరా చేస్తుండడంతో చాలా జాగ్రత్తగా కటింగ్ చేయాలని టైలర్లు అందోళన చెందుతున్నారు. పైగా వ్యవధి తక్కువగా ఉండడంతో కేవలం 15 రోజుల్లో దుస్తులు అందజేయాలని ఒత్తిడి చేస్తున్నారని వాపోతున్నారు. ప్రతీ బడికీ వెళ్లి విద్యార్థుల కొలతలు తీసుకోవాల్సి వస్తుంది. యూనిఫాం ఇవ్వాలంటే కనీసం నెల రోజుల పాటు కష్టపడాల్సి ఉంటుంది. లేదా ఎక్కువ మంది టైలర్లను నియమించుకోవాల్సి ఉంటుంది.

గిట్టుబాటయ్యేలా కూలి

ప్రతీ విద్యార్థికి రెండేసి జతల చొప్పున యూనిఫారాలను అందిస్తున్నారు. ఒక్కో జతకు రూ.75 ఇస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 932 పాఠశాలల్లో 3,6523 మంది బాలురు, 37,742 బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. బాలబాలికల మొదటి జతకు అవసరమైన వస్త్రం మెదక్ జిల్లాలో ఇప్పటికే మండలాలవారీగా ఎంఈవో ఆఫీసులకు చేరుకోగా, వారు ఏపీఎంలకు అందజేశారని జిల్లా విద్యాశాఖ అధికారి రాధాకృష్ణ తెలియజేశారు.



గతంలో గుంపులుగా కొలతలు..

గతంలో యూనిఫాం కుట్టడానికి గంపగుత్తగా కొలతలు తీసుకునేవారు. ఒక తరగతిలో విద్యార్థులను గ్రూపులుగా విభజించేవారు. ఎత్తు, లావు ఆధారంగా 10 మందిలో ఒకరిని శ్యాంపిల్‌గా కొలతలు తీసుకుని, మిగతా వారందరికీ అవే కొలతలతో కుట్టేవారు. దీనివల్ల కొందరికి పొట్టిగా, మరికొందరికి వదులుగా, లేకపోతే బిగుతుగా యూనీఫాంలు ఉండేవి. దీంతో బాలబాలికల్లో ఆత్మన్యూనతాభావం ఏర్పడేది. కొందరు విద్యార్థులు ప్రైవటేగా టైలర్ల వద్దకు వెళ్లి తమ దుస్తులను ఆల్ట్రేషన్ చేయించుకునేవారు. విద్యా కమిషన్ సభ్యులుగా ఉన్న ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తదితరులు విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వానికి కొన్నిసూచనలు, సిఫార్సులు చేశారు. ఈమేరకు ప్రతీ విద్యార్థికి వ్యక్తిగతంగా కొలతలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. దుస్తులు పంపిణీ చేశాక విద్యార్థుల నుంచి ఫిర్యాదులు వస్తే కొలతలు సరిచేయాలని సూచించింది. విద్యార్థులు సంతృప్తి చెందితేనే దుస్తులు కుట్టినవారికి బిల్లులు మంజూరు చేయాలని ఆదేశించింది.

నెలాఖరు లోగా అందిస్తాం

మెదక్ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకు ఏకీకృత దుస్తులు ఈ నెలాఖరు నాటికి అందించేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈసారి బాలబాలికలకు దుస్తుల కొలతలు గ్రూపులుగా కాకుండా ప్రతీ విద్యార్థికి కచ్చితమైన కొలతలు తీసుకోవాలని స్వయంసహాయక గ్రూపులకు ఆదేశాలు జారీ చేశాం. పెద్ద క్లాసులు చదివే బాలురకు నిక్కర్లకు బదులు ప్యాంట్లు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఒక్కో జతకు రూ.75 కుట్టినందుకు ఇవ్వాలని నిర్ణయించింది.

-శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ, మెదక్



భూ భారతితో సమస్యల పరిష్కారం

- రెవెన్యూ సదస్సులతో రైతుల చెంతకే యంత్రాంగం
- సద్వినియోగం చేసుకోవాలి
- గ్రామ సదస్సుల్లో కలెక్టర్లు

7

పనుల జోరు.. వేతనాలు రాక బేజారు

- గతేడాది రూ.11 కోట్లతో ఉపాధిహామీ పనులు
- 4 నెలల నుంచి జతాలు రాక క్షేత్ర సహాయకుల ఇక్కట్లు

8

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి కృషి

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సంగారెడ్డి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : 'ప్రజావాణి'లో వచ్చే అర్జీల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి'కి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించాలని ఆదేశించారు. సోమవారం ప్రజావాణిలో వచ్చిన అర్జీల్లో కొన్ని ముఖ్యమైనవి ఈవిధంగా ఉన్నాయి. కంది మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎల్లమ్మ తమకు సంబంధించిన సర్వే నంబర్ 411-3లో 2.18 ఎకరాల భూమి ఉన్నదని, ఇంత వరకు కొత్త పట్టాదారు పాస్‌బుక్కులు ఇవ్వలేదని ఫిర్యాదు చేశారు. దీంతోపాటు పలువురు పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయాలని అర్జీలు అందజేశారు. భూ సమస్యలు పరిష్కరించాలని మరికొందరు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌వో పద్మజా రాణి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మెదక్‌లో 56 దరఖాస్తులు

మెదక్ అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణికి వచ్చిన ప్రజల నుంచి అదనపు కలెక్టర్ నగేష్ వినతులు స్వీకరించారు. మొత్తం 56 అర్జీలు అందాయి. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మండుటెండల్లో అరుణశోభ

నర్సాపూర్-వెల్దుర్తి రహదారికి ఇరువైపులా చెట్లు ఎర్రటి పూలతో కనువిందు చేస్తున్నాయి. గతంలో అటవీశాఖ ఆధ్వర్యంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి వృక్షాలుగా మారాయి. మండుటెండల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఈ రోడ్డు వెంట వెళ్తున్నవారికి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

-నర్సాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

● యూపీఎస్ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ

నర్సాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, కావున తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని నర్సాపూర్ మండలం అచ్చంపేట యూపీఎస్ పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ కోరారు. సోమవారం గ్రామంలో ఇంటింటికి తిరిగి, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందుతుందని చెప్పారు.

40 పడకల ఆయుష్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలి

సంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో 40 పడకల ఆయుష్ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీధర్‌మహేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అతి తక్కువ ఖర్చుతో అనేక రకాల వ్యాధులను నయం చేసే ప్రాచీన వైద్యమైన ఆయుష్ వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేయాలని ఆయన కోరారు.

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

● రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి అధిక దిగుబడి సాధించాలి

హుస్నాబాద్‌రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి శాస్త్రవేత్తలు సూచించే మెలకువలను పాటించి అధికదిగుబడులు సాధించాలని తోర్నాల ఏరువాక వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్ శ్రీదేవి అన్నారు. సోమవారం హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆధ్వర్యంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె రైతులకు వ్యవసాయానికి సంబంధించి సూచనలు, సలహాలు అందించారు. ఎక్కువగా యూరియా వాడకాన్ని తగ్గించి, రసాయన ఎరువులను అవసరం మేరకే వాడి నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని రైతులకు సూచించారు. ఖరీఫ్‌లో రైతులు విత్తనాలు కొన్నప్పుడు రసీదును పొంది భద్రపరుచుకోవాలన్నారు. పంటల్లో సాగునీటి ఆదా, ప్రత్యామ్నాయ పంటల వివరాలు, చెట్ల పెంపకం లాంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఫోన్‌ద్వారా రైతులకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్‌లో

పంటలకు రైతులు మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడొద్దని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంటలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు ఎం.శాంతి, రవీందర్‌నాయక్ మాట్లాడుతూ నేలకు సంబంధించిన వివిధ అంశాలతో పాటు నేల రకం, స్వభావం, ఎరువుల యాజమాన్యం తదితర వాటిని వివరించారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

రైతుల వద్దకే శాస్త్రవేత్తలు

ములుగు, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేయడానికి సోమవారం వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్‌కు చెందిన శాస్త్రవేత్తలు ములుగు, చిన్నతిమ్మాపూర్, కొక్కొండ గ్రామాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ రైతు శాస్త్రవేత్తల కార్యక్రమంలో ప్రతి వారం 2500 గ్రామాలను శాస్త్రవేత్తలు సందర్శించి మొత్తంగా 1200 గ్రామాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.



పోలీసు, సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహణ

పేటలో పోలీసుల కవాతు

పెద్దశంకరంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): పెద్దశంకరంపేటలో పోలీసు సిబ్బంది సోమవారం సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక పోలీసు బృందం సభ్యులతో పేట పురవీధుల గుండా కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శాంతిభద్రతల దృష్ట్యా నిర్వహించినట్లు ఏఎస్సై తెలిపారు.

మెప్మా నిధుల దుర్వినియోగం అంశంలో కొత్త ట్విస్ట్

● అయోమయంలో రూ.67లక్షలనిధులు

గజ్వేల్, మే 5(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మెప్మాలో నిధుల దుర్వినియోగం అంశం రోజుకో కొత్త మలుపు తిరుగుతుంది. ఇప్పటివరకు దాదాపుగా ఏడు గ్రూపులకు సంబంధించిన సభ్యులు తమకు సంబంధించిన నిధులు దుర్వినియెగం అయ్యాయని మున్సిపల్ కమిషనర్‌కు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన మెప్మా ఆర్పీ కృష్ణలీల ఆత్మాహత్యాయత్నానికి పాల్పడి, ఆర్వీఎం ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవలే బయటకు వచ్చింది. తాజాగా ఆమె గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తాను ఆయా గ్రూపుల నుంచి తీసుకున్న డబ్బులను అప్పట్లో సీఇఓగా పనిచేసిన వంగాల సరితకు ఇచ్చానని, అందుకు సంబంధించిన ఆన్‌లైన్ రసీదులను జతచేశానని పేర్కొన్నారు. దాదాపుగా రూ.67లక్షలకు సంబంధించిన మెప్మా సభ్యుల నిధులు ప్రస్తుతం అయోమయంలో పడ్డాయి. కాగా ఇటీవలే సీఇఓ సరిత దుబ్బాకకు బదిలీ కాగా, ఆమె స్థానంలో హుస్నాబాద్ సీవో గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌కు బదిలీపై వచ్చారు. మెప్మా పీడీ రెండు గ్రూపులకు సంబంధించిన విచారణ చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. ఆర్పీ వ్రాతపూర్వకంగా మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంలో ఈ అంశం కొత్త మలుపు తీసుకుంది.

'పాకిస్తానీయులను బహిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి'

సంగారెడ్డి అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తాన్ జాతీయులను బహిష్కరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు దోమల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు.

తాళం పగలగొట్టి దొంగతనం

టేక్మాల్, మే, 5 (ఆంధ్రజ్యోతి): టేక్మాల్ మండలంలోని కాడిలాబాయి తండాలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంటి తాళం పగలగొట్టి తులం బంగారం, 35తులాల వెండి, 15వేల నగదును దొంగలించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మోహన్ ఉద్యోగానికి వెళ్లగా భార్య కూలీపనికి, కుటుంబసభ్యులు పొలం పనికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళంపగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బైక్ ఢీ ఒకరి మృతి

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న కార్, బైక్ ఢీ కొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం పెద్దశంకరంపేట శివారులో చోటు చేసుకుంది. మల్కాపూర్ గ్రామానికి చెందిన బి.మురళీక్రిష్ణ(30), తన బంధువు హరీశ్‌తో కలిసి మల్కాపూర్‌కు వెళ్తుండగా, రేగోడు వైపు నుంచి వస్తున్న కారు, బైక్ ఢీ కొన్నాయి. దీంతో మల్కాపూర్ గ్రామానికి చెందిన బి.మురళీక్రిష్ణ(30) అక్కడికక్కడే మృతి చెందారు. హరీశ్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. మురళీక్రిష్ణ మృతదేహాన్ని జోగిపేట ఆసుపత్రికి పోస్టుమార్టానికి తరలించారు. మురళీక్రిష్ణకు భార్య అంకిత, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పెద్దశంకరంపేట ట్రైనీ ఎస్సై అరవింద్, సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

ఫోన్లో మాట్లాడుతూ.. చెరువులో దూకి యువతి ఆత్మహత్య

పాపన్నపేట.మే 5 (ఆంధ్రజ్యోతి): ఫోన్‌లో మాట్లాడుతూ చెరువులో దూకి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని మల్లంపేటలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మల్లంపేట గ్రామానికి చెందిన చాకలి మల్లయ్య, శ్యామల దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. మల్లయ్య మృతి చెందగా తల్లి శ్యామల ఇద్దరు ఆడపిల్లల పెళ్లిలు చేసింది. బతుకుదెరువు కోసం శ్యామల చిన్న కూతురు ప్రియాంకతో కలసి కొంతకాలం హైదరబాద్‌కు వలస వెళ్లారు. రెండునెలల క్రితం సొంత గ్రామానికి వచ్చారు. సోమవారం ప్రియాంక ఫోన్లో మాట్లాడుతూ గ్రామంలోని రెడ్ల చెరువు వద్దకు వెళ్లి నీటిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

తృటిలో తప్పిన ప్రమాదం

టేక్మాల్, మే 5 (ఆంధ్రజ్యోతి): 161 రహదారిపై వాహనం టైర్ పంచర్ అయి అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ సంఘటన టేక్మాల్ మండల పరిధిలోని బోడ్మాట్ పల్లి గ్రామ సమీపంలో జరిగింది. నారాయణఖేడ్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు బోల్తా పడటంతో కారులోని ఎయిర్‌బాక్స్ తెరుచుకోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరలేదు. అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. .

పరిశ్రమలు ఏర్పాటు చేయండి: ఎమ్మెల్సీ సత్యం

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడి వలసలకు పేరు గాంచిన నారాయణఖేడ్ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసి వలసలను నివారించాలని సీపీఐ ఎమ్మెల్సీ నేలకంటి సత్యం అన్నారు. ఖేడ్‌లో సోమవారం సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంజీరానది ఈ ప్రాంతం మీదుగానే ప్రవహిస్తున్నందున జలాలను ఈ ప్రాంత సాగు, తాగునీటి అవసరాలకు ఇవ్వాలన్నారు.

సౌత్‌జోన్ నేషనల్ హ్యాండ్‌బాల్ పోటీలకు కార్తీక్

మద్దూరు, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బేజాడి కార్తీక్ గౌతమ్ హ్యాండ్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనపరచాడు. 9 నుంచి 12 వరకు తమిళనాడులో జరిగే టోర్నమెంట్‌లో తెలంగాణ జట్టు తరపున పాల్గొంటున్నట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌బాబు తెలిపారు.


నంగునూరు మండలం దర్గపల్లి గ్రామంలో అకాల వర్షంతో రాలిన మామిడి తోటలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు


మనోహరాబాద్ మండలం కోనాయపల్లి గ్రామంలో నేలకొరిగిన వరి పైరు


అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో కొలతలతో పంట నష్టం అంచనా వేస్తున్న వ్యవసాయాధికారులు

అకాల కష్టం

సిద్దిపేట జిల్లాలో 9,368 ఎకరాల్లో పంటలకు నష్టం

మెదక్ జిల్లాలో సుమారు 500 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

- క్షేత్రస్థాయిలో పర్యటించిన వ్యవసాయాధికారులు
- ప్రాథమికంగా నష్టం అంచనా
- రైతులను ఓదార్చిన నాయకులు

దుబ్బాక/రాయపోల్/కోహెడ/కొండపాక, మే 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షం అన్నదాతల కష్టాన్ని నీళ్లపాలు చేసింది. ఆదివారం సాయంత్రం సిద్దిపేట, మెదక్ జిల్లాలో కురిసిన వడగండ్ల వాన అపార నష్టాన్ని మిగిల్చింది. వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. సోమవారం వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయి సందర్శనకు వెళ్లి ప్రాథమికంగా నష్టాన్ని అంచనా వేశారు. వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు భరోసా కల్పించారు. వ్యవసాయాధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం.. సిద్దిపేట జిల్లాలో దాదాపుగా 9,368 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. దుబ్బాక నియోజవర్గంలో ఎక్కువగా నష్టం చేకూరింది.

● దుబ్బాక నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 3,441 ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు దుబ్బాక వ్యవసాయ శాఖ ఏడీఏ మల్లయ్య తెలిపారు. సోమవారం ఏవోల బృందం క్షేత్రస్థాయి పరిశీలన జరపగా, దుబ్బాక మండలంలో స్వల్పంగా నష్టం వాట్టిలిందని తెలిపారు. దౌల్తాబాద్ మండలంలో 350 ఎకరాల్లో వరి పంట దెబ్బతినడంతో సుమారు 180 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. భూంపల్లి- అక్బర్‌పేట మండలంలో 837 ఎకరాల్లో వరి, 11 ఎకరాల్లో మొక్కజొన్న, ఐదెకరాలో కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందని చెప్పారు. తొగుట మండలంలో 545 ఎకరాల వరి, 15 ఎకరాల్లో మొక్కజొన్న, 18 ఎకరాల కూరగాయల పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. మిరుదొడ్డి మండలంలో సుమారు 1,660 ఎకరాలు


కొండపాక మండలం అంకిరెడ్డిపల్లిలో నేలరాలిన మామిడికాయలను పరిశీలిస్తున్న దృశ్యం

పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.

● రాయపోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో సుమారు 350 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారి నరేష్ తెలిపారు. 314 ఎకరాల్లో వరి, 22 ఎకరాల్లో మొక్కజొన్న, 15 ఎకరాల్లో కూరగాయల పంటలకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని పేర్కొన్నారు.

● కోహెడ మండలంలో 1,274 ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. సోమవారం జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి సువర్ణ, మండల వ్యవసాయ అధికారి సతీష్ మండలంలోని పలు గ్రామాల్లో దెబ్బతిన్న మామిడి, ఇతర పంటలను పరిశీలించారు. మండలంలోని 447 మంది రైతులకు సంబంధించిన 1,274 ఎకరాల్లో మామిడి, కొంత భాగం వరి, మొక్కజొన్న, నిమ్మ పంటలకు నష్టం జరిగినట్లుగా ప్రాథమిక అంచనా వేశారు. వారి వెంట మండల ఉద్యానవన అధికారి బాలాజీ, ఆర్ఐ ఎల్లయ్య, ఏఈవోలు, పలువురు ఉన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు దెబ్బతిన్న పంటలను, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అకాల వర్షంతో పంటలను నష్టపోయిన ప్రతీ రైతుకు పరిహారం అందించాలని కొండబత్తిని సతీష్, మామిడి కర్ణాకర్, నరాల శ్రీకాంత్ తదితరులు డిమాండ్ చేశారు.

● కొండపాక మండలంలోని మండలంలోని మర్పడగ, సిరసనగండ్ల, ఖమ్మంపల్లి, దమ్మకపల్లి, కొండపాక తదితర గ్రామాల్లో వివిధ పంటలకు నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించిన నష్టం వివరాలను సేకరించారు. పలు గ్రామాల్లో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణతో కలిసి పరిశీలించారు.


రామాయంపేట మండలం రాయిలాపూర్ శివారు పొలాల్లో వరి పైరును పరిశీలిస్తున్న మైనంపల్లి

మెదక్ జిల్లాలో మూడు మండలాల్లో

అల్లాదుర్గం/చేగుంట/రామాయంపేట/నిజాంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని రామాయంపేట, చేగుంట, అల్లాదుర్గం మండలాలో పరిధిలో ఆదివారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వానకు 500 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్‌లో శివారులోని పెద్దచెరువు ఆయకట్టులో దెబ్బతిన్న వరి పంటను మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఎంపీఎస్‌వో సుమయ, ఏఈవో విఠల్ రావు తదితరులు సోమవారం పరిశీలించారు. బాధిత రైతు రోదన వారిని కలిచివేసింది. పంట చేతికందే సమయానికి నీటిపాలైందంటూ ఆవేదనను వ్యక్తం చేశారు. గడిపెద్దాపూర్‌లో 264 ఎరాల్లో పంట దెబ్బతిందని ప్రాథమిక అంచనా వేశామని వ్యవసాయ శాఖ అధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. చేగుంట మండలంలో వ్యవసాయ అధికారి హరిప్రసాద్ పంటలను పరిశీలించారు. మండలంలోని మక్కరాజపేట్, రాంపూర్, కసాన్పల్లి, చందాయిపేట్, గ్రామాల్లో 112 మంది రైతులకు చెందిన 157 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలిపారు. మక్కరాజుపేట శివారులో 112 ఎకరాలు, రాంపూర్ శివారులో 26 ఎకరాలు కసాన్పల్లిలో 10 ఎకరాలు, చందాయపేట్ శివారులో 9 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు అంచనా వేశామని పేర్కొన్నారు. రామాయంపేట మండలంలో 80 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. నిజాంపేట మండలంలో మామిడి తోటలను వ్యవసాయాధికారి సోమలింగారెడ్డి, ఏఈవో శ్రీలతతో కలిసి పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. చల్మెడ గ్రామంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు.

మామిడి తోటలను పరిశీలించిన కలెక్టర్

అక్కన్నపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండల కేంద్రంలో దెబ్బతిన్న మామిడి తోటలను సోమవారం కలెక్టర్ మనుచౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిచిందని, పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు పంట నష్టంపై సర్వే చేసి, రిపోర్ట్ పంపించాలని ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, తదితరులు ఉన్నారు.


అక్కన్నపేటలో మామిడి తోటలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

● మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్/రామాయంపేట, మే 5(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయడంతోపాటు, పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని, ఎలాంటి ఆందోళన చెందాల్సి అవసరం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి రైతులకు రావాల్సిన పరిహారం ఇప్పిచేందుకు చొరవ తీసుకుంటానని ఆయన వెల్లడించారు. రామాయంపేట మండల పరిధి రాయిలాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, టీపీసీసీ కార్యదర్శి సుప్రభాత రావు తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

● కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడగండ్లతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని లింగంపేట, కాన్గల్, ఎల్లారెడ్డిపేట, పెద్దమాసాన్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. చేతికందే సమయంలో అకాల వర్షంతో పంట నష్టం జరగడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. పంట నష్టం వివరాలను వ్యవసాయ అధికారుల నుండి తెప్పించుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా నష్టపరిహారం అందేలా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కం స్వామి, నాయకులు ఉన్నారు.

రైతులపై హరీశ్‌రావుది కపట ప్రేమ

● కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ

సిద్దిపేట ఆంధ్రజ్యోతి/సిద్దిపేట రూరల్, మే 5 : రైతులపై హరీశ్‌రావుది కపట ప్రేమని, అకాల వర్షం కురిసి గ్రామాల్లో రైతులు ఆగమైతుంటే ఫొటోలకు ఫోజులు ఇస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణ ఆరోపించారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం వెంకటపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో తడిపిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరీశ్‌రావు మంత్రిగా ఉన్న సమయంలోనే రైతులను పట్టించుకోలేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో పంట నష్టం జరిగినప్పుడు ఎకరాకు పది వేలు చొప్పున నష్టపరిహారం చెల్లిస్తామని రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసగించారని మండిపడ్డారు. రైతులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని పూజల హరికృష్ణ రైతులకు భరోసా కల్పించారు. ఆయన వెంట పీసీసీ కార్యదర్శి గంప మహేందర్‌రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు బొమ్మల యాదగిరి, తదితరులు ఉన్నారు. సిద్దిపేట పట్టణంలోని మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ పరిశీలించి, రైతులకు భరోసా కల్పించారు.


రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద రైతుల ధర్నా

నష్టపరిహారం కోసం రైతుల ధర్నా

● గజ్వేల్ - చేగుంట రహదారిపై నిలిచిన వాహనాలు

రాయపోల్, మే 5 (ఆంధ్రజ్యోతి): చేతికొచ్చిన పంటలు వడగండ్ల వర్షంతో నేలపాలయ్యాయని అధికారులు వెంటనే పరిశీలించి నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాయపోల్ మండలం గుర్రాలసోఫా వద్ద గజ్వేల్ - చేగుంట రహదారిపై రామారం, సయ్యద్‌నగర గ్రామాల రైతులు ధర్నా చేపట్టారు. రెండు గంటల పాటు రైతులు రోడ్డుపై ఆందోళన చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఆదివారం రాత్రి కురిసిన వడగళ్ల వానకు వడ్లు పూర్తిగా రాలిపోయాయని, ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఓ రైతు ఏకంగా పురుగుల మందు డబ్బా చేతిలో పట్టుకుని నిరసనలో పాల్గొన్నాడు. రాయపోల్ ఏవో నరేష్, పోలీసులు అక్కడకు చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. నష్టపోయిన రైతుల పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. ధర్నాలో మాజీ వైస్ ఎంపీపీలు రాజిరెడ్డి, తలారి నర్సింలు, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతో రైతులకు పడిగాపులు : హరీశ్‌రావు

సిద్దిపేట కలెక్టరేట్, మే 5(ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్లక్ష్యం, సకాలంలో ధాన్యం సేకరణ చేయడంలో ప్రభుత్వ వైఫల్యంతో రోజుల తరబడి మార్కెట్ యార్డుల వద్ద రైతులకు పడిగాపులు తప్పడం లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సిద్దిపేట మార్కెట్‌యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఇప్పటికే మార్కెట్లో 3,500 ధాన్యం బస్తాలు తరలించడానికి సిద్ధంగా ఉన్నా, లారీలు లేకపోవడంతో, ధాన్యం నీటిపాలైందని రైతులు హరీశ్‌రావుకు తెలిపి ఆవేదన వ్యక్తం చేశారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్‌తో హరీశ్‌రావు ఫోన్లో మాట్లాడి లారీలను, హమాలీలను వెంటనే సమకూర్చి ధాన్యాన్ని సేకరించాలని ఆదేశించారు. లారీ అసోసియేషన్‌తో మాట్లాడి ధాన్య సేకరణకు లారీలను పంపించాల్సిందిగా కోరారు. ధాన్యాన్ని చూసి కన్నీరుమున్నీరవుతున్న రైతులను ఆయన ఓదార్చారు.

నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలి

నంగునూరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం నంగునూరు మండలం దర్గపల్లి గ్రామంలో అకాల వర్షానికి నష్టపోయిన మామిడి తోటలను పరిశీలించి మాట్లాడారు. మొన్న వరి చేన్లు దెబ్బతింటే.. నేడు మామిడి తోటలకు నష్టం వాటిల్లిందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 1,800 ఎకరాల్లో మామిడి పంటలకు నష్టం జరిగిందన్నారు. వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ శాఖ, రెవెన్యూ శాఖ, అధికారులు నష్టపరిహారం అంచనా వేసి తక్షణమే సహాయం అందించాలని తెలిపారు. నెలరోజుల్లోనే ప్రకృతి పగబట్టినట్టుగా ఐదుసార్లు అకాల వర్షాలు కురిశామని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎకరాకు రూ.35 వేల పరిహారం చెల్లించాలి : ఎమ్మెల్యే కేపీఆర్

తొగుట/మిరుదొడ్డి/రాయపోల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వడగండ్లతో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.35 వేలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు, ఆస్తి నష్టం వాటిల్లిన రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి(కేపీఆర్) డిమాండ్ చేశారు. నియోజకవర్గంలోని మిరుదొడ్డి మండలం అల్వాల, తొగుట మండలం లింగంపేట్, కాన్గల్, రాయపోల్ మండలం రామారం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో సోమవారం ఆయన పరిశీలించి, రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడగండ్ల వర్షంతో చేతికివచ్చిన పంట దెబ్బతినడంతో రైతులు బోరున విలపిస్తుంటే, వారికి భరోసా ఇవ్వాల్సిన జిల్లా కలెక్టర్ భూభారతి మీటింగ్‌కు వెళ్లానని చెప్పడం చూస్తేనే రైతుల పట్ల వారికి ఏపాటి ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. జిల్లా మంత్రులు క్షేత్రస్థాయిలో పర్యటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మల్లన్నసాగర్ రిజర్వాయర్ నీళ్లను సరైన సమయంలో పంటల సాగుకు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించిందని మండిపడ్డారు. దీంతో కూడవెల్లి పరివాహక ప్రాంతాల్లో సుమారు 574 రైతులకు సంబంధించి 1600 ఎకరాల్లో పంటనష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

లంచాలు ఇవ్వనిదే పనులు జరగడం లేదు

అవినీతిని అంతం చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, రెవెన్యూ, పోలీసుస్టేషన్లతోపాటు ఇతర కార్యాలయాల్లో లంచాలు లేనిదే పనికావడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సంచలన వాఖ్యలను చేశారు. జిల్లా నుంచి మొదలుకొని మండలస్థాయి వరకు ఏశాఖలో ఏ పని కావాలన్నా లంచాలు ఇవ్వకుండా జరగడం లేదని ఆరోపించారు.


మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో వరి చేలును పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి

నేడు వేణుగోపాల స్వామి జాతర ప్రారంభం

శివ్వంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధి దొంతిలోని వేణుగోపాలస్వామి ఆలయం బ్రహ్మోత్సవాల జాతరకు ముస్తాబైంది. ప్రతి ఏటా వైశాఖ మాసంలో 10 రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నెల 6 నుంచి 16 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

రేపటి నుంచి నర్సాపూర్‌లో వాసవీ కన్యకపరమేశ్వరీ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

నర్సాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ పట్టణంలో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యాక పరమేశ్వరీ ఆలయంలో అమ్మ వారి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ఈ నెల 7వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. 7న ఉదయం ప్రత్యేక పూజలతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 9ఎవరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

లింగాపూర్‌లో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆకుల లింగాపూర్‌లో మంగళవారం నుంచి ఈనెల 11 వరకు శ్రీలక్ష్మీ వెంకటేశ్వర కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల కోసం ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భవానీ మాతకు బోనాలు, 7న శ్రీలక్ష్మి వెంకటేశ్వర కల్యాణం, బండ్ల ప్రదక్షణ, లాజహోమం, రేణుక ఎల్లమ్మ వీధి నాటకం మొదటి భాగం ప్రదర్శన నిర్వహించనున్నారు. 11న కుస్తీపోటీలు, వీధి నాటకం చివరి భాగం ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

బగలాముఖి ఆలయంలో జయంతి పూజలు

శివ్వంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన శివ్వంపేటలో వెలసిన శక్తిపీఠం బగలాముఖి ఆలయంలో సోమవారం అమ్మవారి జయంతి సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో హరిద్రహర్చన, మహా పూజ, మహా మంత్రాహవనం ఘనంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యల విచ్చేసిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

హత్నూర పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

హత్నూర, మే 5 (ఆంధ్రజ్యోతి): హత్నూర పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ పరితోష్ పంకజ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో రికార్డుల పరిశీలనతో పాటు కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో పోలీసు అధికారులు, సిబ్బంది స్నేహపూర్వకంగా ఉండి సహకరించాలని సూచించారు. ఎస్ఐ సుభాష్‌తో పాటు సిబ్బందితో ఎస్పీ మాట్లాడి మండలానికి సంబంధించిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పేదల కలలను సాకరం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని, సర్వే నిర్వహించి, పారదర్శకంగా అర్హులైన వారికే ఇళ్లను కేటాయిస్తామని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ మండలం ఆద్మాపూర్‌లో పర్యటించి ఇందిరమ్మ లబ్ధిదారులను కలిసి వారితో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే పక్కాగా నిర్వహించేలా మండల ప్రత్యేక అధికారులు బాధ్యత వహించాలన్నారు. స్థానిక ప్రాథమికోన్నత పాఠశాలకు కలెక్టర్ సందర్శించారు. విన్నూత విద్యాబోధనకు చర్యలు తీసుకుంటున్న ఉపాధ్యాయుడు రవిరాజ్‌ను అభినందించారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

- భూ సమస్యల పరిష్కారం కోసమే భూభారతి
- వచ్చిన దరఖాస్తులకు నెలలోపు పరిష్కారం
- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

కొండాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : భూసంబంధిత సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి కోరారు. మండలంలోని తొగర్‌పల్లిలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించి, భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పైలెట్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు ఒక మండలాన్ని ఎంపిక చేయగా, సంగారెడ్డి జిల్లాలో కొండాపూర్ మండలం ఎంపికైనట్లు వెల్లడించారు. జిల్లాలో భూసమస్యలు లేని మండలంగా తీర్చిదిద్దాలని, రెవెన్యూ సదస్సుల అనంతరం నెలలోపు భూసమస్యలన్నీ భూభారతి చట్టంతో పరిష్కారిస్తామన్నారు. సమస్యల కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరం అధికారులు, సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తారు. భూభారతి-2025 చట్టంతో అధికారులకు అధికారాలన్నీ వికేంద్రీకరించడంతో జవాబు దారితనం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, ఆర్డీవో రవీందర్‌రెడ్డి, సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, తహసీల్దార్ అశోక్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


తొగర్‌పల్లిలో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను స్వీకరించి మాట్లాడుతున్న సంగారెడ్డికలెక్టర్ క్రాంతి

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

చిలప్‌చెడ్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతుల భూ సమస్యలను తీర్చడానికే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద చిలప్‌చెడ్ మండలం ఎంపిక అవగా సోమవారం మండలం పరిధిలోని రాందాసుగూడా, రహీంగూడా గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వారి సమస్యలను ముఖాముఖి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించిన సమస్యలను గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులలోనే పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తారని చెప్పారు. గణ్యాతాండాలో ఎప్పటినుంచో ఉన్న భూ సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి కలెక్టరుకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సోమక్కపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి రైతులను సమస్యలు అడిగి తెలుసున్నారు.

20 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

● సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి

అక్కన్నపేట, మే 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అక్కన్నపేట మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, ఈ నెల 20 వరకు మండలంలోని అన్ని భూభారతి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తామని సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. సోమవారం ఆయన అక్కన్నపేట మండల కేంద్రంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం గతంలో మాదిరిగా కోర్టులను ఆశ్రయించాల్సిన అవసరం లేదన్నారు. షెడ్యూల్ ఏ ద్వారా ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తీసుకున్న దరఖాస్తుల డేటాను సాయంత్రం ఎంటర్ చేసి భూభారతి పోర్టల్‌లో పెట్టడం జరుగుతుందని, సమస్యను బట్టి చట్టంలో ఉన్న విధంగా ఇరువర్గాలకు నోటీసులు జారీ చేసి వారం రోజుల్లో తహసీల్దార్ స్థాయిలో పరిష్కారం అవుతుందన్నారు. భూభారతి చట్టంలో అన్ని సమస్యలు కూడా జిల్లా స్థాయిలోనే శాశ్వతంగా పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. ఇందులో ఆర్డీవో రామ్మూర్తి, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

విద్యార్థినికి సన్మానం

నర్సాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆకాంక్షించారు. పదో తరగతిలో పట్టణ టాపర్‌గా నిలిచిన పట్టణానికి చెందిన డాక్టర్ దంపతులైన నజీమ్‌బేగ్, ఫాజియాజహీర్ దంపతుల కూతురు మరియమ్‌మీర్జాబేగ్‌ను తన స్వగృహానికి పిలిపించి సన్మానించింది.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లాదుర్గం, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వట్‌పల్లి ఏఎంసీ చైర్‌పర్సన్ లక్ష్మీశేషారెడ్డి, తహసీల్దార్ మల్లయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి మృతిపట్ల సంతాపం

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి ఎంజీ.ప్రియదర్శిని మృతి పట్ల ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ మంథాని ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు సంతాపాన్ని ప్రకటించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు మారుతిరెడ్డి, నర్సారెడ్డి, లక్ష్మణ్‌రావు, సంగమేశ్వర్‌రెడ్డి, సుధాకర్, సాయిలు, జీవన్‌కుమార్, భువనేశ్వరి పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి


వెంకట్‌రాం (ఫైల్)

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతిచెందాడు. ఖేడ్ పట్టణానికి చెందిన వెంకట్‌రాం(55) సిర్గాపూర్ మండలం వాసర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ పండిత్‌గా పనిచేస్తున్నాడు. మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో భవానీమాత దర్శనం చేసుకుని ఆదివారం రాత్రి తిరిగి వస్తుండగా.. ఛాతిలో నొప్పితో బాధపడుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వెంకట్‌రాం మృతిపట్ల తోటి ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చిన్నశంకరంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఆదర్శ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వాణికుమారి సోమవారం తెలిపారు. 5 నుంచి 20 తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీరిస్తున్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎమ్ఈసీ గ్రూపులు ఉన్నాయని ఒక్కక గ్రూపునకు 40 సీట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి ఫీజు లేదన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను 26న విడుదల చేస్తామన్నారు.

విడి పరికరాలకు వేలం

మెదక్ అర్బన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు శాఖకు సంబంధించి వాహన విడిభాగాలకు ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో వేలం పాట నిర్వహించినట్లు అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. పోలీసు వాహనాలకు విడి భాగాలైన టైర్లు, బ్యాటరీలు తదితర పరికరాలను వేలం పాట నిర్వహించగా.. వివిధ జిల్లాలకు చెందిన 21 మంది పాల్గొన్నారన్నారు. ఈ వేలంలో టైర్లు రూ.56 వేలు, బ్యాటరీలు, రూ.1.49 లక్షలు, పరికరాలు రూ.18 వేలకు వేలం పాటలో కామారెడ్డి జిల్లాకు చెందిన అబ్దుల్ ఖలీల్ దక్కించుకున్నట్లు తెలిపారు.


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్(ఫైల్)

పనుల జోరు.. వేతనాలు రాక బబేజారు

- గతేడాది రూ.11 కోట్లతో పలు రకాల పనులు

ఝరాసంగం, మే 5 (ఆంధ్రజ్యోతి) : రెక్కాడితేనే కానీ డొక్కాడని నిరుపేదలకు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం వరంలా మారింది. సొంత ఊరిలో ఉపాధి కల్పనతో ఆర్థికంగా ఊరట చెందుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు అంతంత మాత్రమే ఉండడంతో కూలీలు అధికంగా వస్తున్నారు. దీంతో ఉపాధిహామీ పనులు జోరుగా కొనసాగుతున్నాయి. ఝరాసంగం మండలంలోని 33 గ్రామాల్లో పనులు కొనసాగుతుండగా.. 11,513 మంది కూలీలు పనిచేస్తున్నారు. మొత్తం జాబ్‌కార్డుల సంఖ్య 8,805, అక్టివ్ జాబ్ కార్డులు 6,423, వందరోజులు పని దినాలు పూర్తిచేసుకున్న కుటుంబాలు 529 ఉన్నాయి. గతేడాది ఉపాధి హామీ పథకంలో రూ.11 కోట్లతో పనులు చేపట్టారు.

జల సంరక్షణ పనులకు ప్రాధాన్యం

భూగర్భ జలాలను అభివృద్ధి చేయడంతో పాటు రైతులకు సాగు, తాగునీరు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం భావిస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని మండలంలో జల సంరక్షణ పనులకు అధికారులు ప్రాముఖ్యత ఇస్తున్నారు. ఈ పనులపై అధికారులు కూలీలకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా నీటి కుంటలు, చెక్‌డ్యాంలో పూడికతీత, మళ్లింపు కాల్వలు, మట్టి కుంటల వంటి పనులను చేస్తున్నారు. భూగర్భ జలాల పెంపునకు ఈ పనులు ఎంతో దోహదపడతాయని అధికారులు తెలియజేస్తున్నారు.

వేతనాల రాక ఇక్కట్లు

గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పనులు కల్పిస్తున్న క్షేత్ర సహాయకులు, ఏపీవోలకు నాలుగు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలని కోరుతున్నారు.

నిలిచిన ఉపాధిహామీ పనులు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కోహీర్, మే 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలోని గొటిగర్‌పల్లి, సిద్ధాపూర్ తండా, పీచేర్యాగడి, పీచేర్యాగడితండా, ఖానాపూర్ బడంపేట, పర్శపల్లి, సజ్జాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిలిచిపోయాయి. ఆ గ్రామాల్లో పనులు చేసేందుకు కూలీలు ఉన్నా.. పనిచేసే ప్రాంతాలు లేవు. ఆ గ్రామాల పరిధిలో సాగు, ప్రభుత్వ భూముల కంటే అటవీ భూముల ఎక్కువగా ఉండటం వల్ల అటవీశాఖ అధికారులు పనులు చేయనీయడం లేదు. ఉపాధిహామీ సిబ్బంది, సంబంధిత అధికారులు వార్షిక ప్రణాళిక రూపొందించడంలో నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రస్తుతం ఆ గ్రామంలో పనులు చేసేందుకు పని ప్రదేశాలు లేవు. ఈ విషయమై సంబంధిత అధికారులను వివరణ కోరగా.. అటవీశాఖ అధికారులు పనిచేయనీయడం లేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి ఉపాధిహామీ పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడండి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


మున్సిపల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌చౌహాన్‌ను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశించారు. సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. సంగారెడ్డి పట్టణంలో నీటి సమస్య తలెత్తితే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పట్టణంలో పారిశుధ్యం, వీధి దీపాలపై ప్రత్యేక దృష్టిపెట్టి ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. సంగారెడ్డిలో డంపింగ్‌యార్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డంపింగ్‌యార్డు ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాన్నారు. అధికారులు ప్రజల వినతులకు స్పందించి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీఈఈ ఇంతియాజ్, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, విఠల్, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ఆలస్యమతే సహించం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


అమీన్‌పూర్ చందానగర్ రోడ్డు విస్తరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 5 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనుల్లో నత్తనడకను సహించనని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అధికారులను హెచ్చరించారు. సోమవారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో అమీన్‌పూర్ నుంచి చందానగర్ వరకు విస్తరిస్తున్న 150 ఫీట్ల రోడ్డు పనులను ఆయన పరిశీలించి, నత్తనడకపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా నిలిచిన విద్యుత్ స్తంభాలు, టవర్లను తరలించడంలో తీవ్ర జాప్యం ఏర్పడటంపై ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. లైన్ల తరలింపునకు రూ.1.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. వాణినగర్ నుంచి పెద్దచెరువు వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయని, మిగతా విస్తరణ వేగంగా పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రూ.7 కోట్లతో చేపడుతున్న సాకి చెరువు సుందరీకరణ పనులను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో అమీన్‌పూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, తహసీల్దార్ వెంకటస్వామి, ట్రాన్స్‌కో డీఈ భాస్కర్‌రావు, మున్సిపల్ డీఈ వెంకటరమణ, మాజీ కౌన్సిలర్లు, జీహెచ్ఎంసీ అర్బన్ ఫారెస్ట్ ఎఫ్ఆర్‌వో ప్రణీత్‌కౌర్, డీఆర్‌వో రవికిరణ్ పాల్గొన్నారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

- తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల


శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెన్నెల

శివ్వంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాధికారం కోసం బహుజనులు ఉద్యమించి దేశాన్ని రక్షించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల అన్నారు. మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామంలో వారం కాంగ్రెస్ నాయకులు బండారి గంగాధర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని వెన్నెల గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

బీఆర్ఎస్ మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరు : హనుమంతరావు


సమావేశంలో మాట్లాడుతున్న హనుమంతరావు

శివ్వంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : పభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు విశ్వసిస్తున్నారని రాజకీయ ఉనికి కోసమే బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్‌పై అసత్యపు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన శివ్వంపేటలో కొడకంచి శ్రీనివాస్ గౌడ్ నివాసంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలు ప్రజలు నమ్మవద్దని తెలిపారు. శివ్వంపేటకు వచ్చిన హనుమంతరావును కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, శివసాయిగౌడ్ గజమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సుదర్శన్‌గౌడ్, నాయకులు మహిపాల్‌రెడ్డి, జంగంవెంకటేష్, పూల్ సింగ్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

వెల్దుర్తి/తూప్రాన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి తహసీల్దార్‌గా బీ.బాలలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు వెల్దుర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కృష్ణ రేగోడ్ మండలానికి బదిలీ అయ్యారు. రేగోడ్ మండలంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన బాలలక్ష్మి బదిలీపై వెల్దుర్తికి వచ్చారు. అలాగే తూప్రాన్ తహసీల్దార్‌గా టేక్మాల్ శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన విజయలక్ష్మిని నర్సాపూర్ డివిజన్ కార్యాలయ డీఏవోగా బదిలీచేశారు.

పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి


తూప్రాన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎల్లం, లక్ష్మణ్

తూప్రాన్, మే 5 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ పేర్కొన్నారు. తూప్రాన్ తపస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ విధానం రద్దుచేసి ఓపీఎస్ విధానం అమలు చేయాలన్నారు. స్థానికత ఆధారంగా అదనపు పోస్టులు సృష్టించి, జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఇందులో తపస్ నాయకులు భానుప్రసాద్ పాల్గొన్నారు.

మానసిక దృఢత్వం, పరిపక్వతకు వేసవి శిబిరాలు

నిజాంపేట/వెల్దుర్తి, మే 5 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో మానసిక దృఢత్వం, పరిపక్వతకు వేసవి శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని మండల విద్యాధికారి సొంగని యాదగిరి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉన్నత విద్యార్థులకు వేసవి శిక్షణా శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఫోన్లకు పరిమితం కాకుండా శిబిరాలతో మానసిక దృఢత్వాన్ని, మనోధార్యాన్ని పెంపొందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేందర్, వెంకట్‌స్వామి సీఆర్పీ రాజు పాల్గొన్నారు. వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణా శిబిరాన్ని ఎంఈవో యాదగిరి ప్రధానోపాధ్యాయుడు సాంబయ్యతో కలిసి ప్రారంభించారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

సంగారెడ్డి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీహెచ్ఎస్)లో 5, 6, 7వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులకు పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ (పీపీటీ) ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. వీటికి సంబంధించిన ప్రశ్నాపత్రాలను సంగారెడ్డి ఎంఈవో విద్యాసాగర్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు, జిల్లా కార్యదర్శి సాయితేజ, జిల్లా కమిటీ సభ్యులు ప్రభాకర్, రవికుమార్, అర్జున్, సంతోష్‌కుమార్, పరీక్ష కో ఆర్డినేటర్ సుష్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

- రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షులు మైసయ్య


రైతులతో మాట్లాడుతున్న మైసయ్య

వెల్దుర్తి/చిన్నశంకరంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రైతు రక్షణ సమితి జిల్లా గౌరవాధ్యక్షులు మైసయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీల కొరత ఉందని, హమాలీలను ఏర్పాటు చేస్తే త్వరగా తూకం జరుగుతుందన్నారు. అలాగే ధాన్యం తరలింపునకు లారీలను పెంచాలని అధికారులను కోరారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైస్‌మిల్లుకు తరలించాలని తహసీల్దార్ మన్నన్ అన్నారు. సోమవారం చిన్నశంకరంపేట మండలంలోని గవ్వపల్లి, తదితర గ్రామాల ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులు తీసుకొచ్చిన ధాన్యం తూకాన్ని పరిశీలించారు.

రైతులకు రాగి అంబలి పంపిణీ

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట వరి కొనుగోలు కేంద్రంలో, సిర్గాపూర్ మండలం కడ్పల్‌లోని జొన్నల కొనుగోలు కేంద్రంలో సోమవారం జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మశ్చేందర్ సూచన మేరకు ప్రతినిధులు రైతులకు ఉచితంగా రాగి అంబలిని పంపిణీ చేశారు. మొబైల్ వాహనంతో వెళ్లిన ఫౌండేషన్ ప్రతినిధులు పరశురాంరెడ్డి, తుకారాం, శ్రీనివాస్, అభిపవార్ రైతులకు అంబలిని అందించారు.

ధర్మరక్షణకు దయ, ప్రేమ విధానాలు సోపానాలు

- మాధవనానంద సరస్వతీస్వామి

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : ధర్మ రక్షణకు దయ, ప్రేమ, సత్యం, అహింసా విధానాలు సోపానాలని రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి అన్నారు. సోమవారం నారాయణఖేడ్‌కు వచ్చిన సందర్భంగా సత్యనారాయణస్వామి ఆలయంలో భక్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రపంచానికి, పరమాత్మకు అనుసంధాన కర్త ధర్మమే అన్నారు. ఆయన వెంట సత్యనారాయణ స్వామి ఆలయ వ్యవస్థాపకులు చిన్నిమధుకర్, తదితరులు ఉన్నారు.

క్షేత్ర శిక్షణ విద్యార్థులకు ఉపయోగం

- సంగారెడ్డి ఫల పరిశోధన శాస్త్రవేత్త సుచిత్ర


కార్యక్రమంలో మాట్లాడుతున్న సుచిత్ర

జహీరాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి) : క్షేత్ర శిక్షణ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని సంగారెడ్డి ఫల పరిశోధన శాస్త్రవేత్త సుచిత్ర పేర్కొన్నారు. ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ రాజేంద్రనగర్‌కు చెందిన విద్యార్థులకు మూడునెలలుగా రంజోల్‌లో కొనసాగిన గ్రామీణ శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రంజోల్ రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు చదువుకోవడం ఓ ఎత్తైతే క్షేత్రస్థాయి సందర్శన మరో సవాల్‌గా మారుతుందన్నారు. ఇందులో భాగంగా క్షేత్ర సందర్శనకు వచ్చిన 42 మంది విద్యార్థులు వారి అనుభవాలను పలువురికి వివరించారు.

గుర్తింపుకార్డులతో రైతులకు ప్రయోజనం

జహీరాబాద్/కంగ్టి, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న రైతు గుర్తింపుకార్డుల ప్రక్రియతో రైతులకు ప్రయోజనం చేకూరనుందని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని హోతి(బి) గ్రామంలో గల రైతువేదికలో గుర్తింపుకార్డులపై అవగాహన కల్పించారు. కంగ్టి మండల పరిధిలోని నాగూర్.కెలో ఏఈవో సంతోష్ రైతు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ప్రతి రైతుకు సంబంధించి భూమి వివరాలతో, 11 నంబర్లతో యూనిక్ ఐడీ కార్డును కేటాయిస్తామన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో సాగు చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న కచురరావు

రాయికోడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం సాగు చేసుకుంటే అధిక దిగుబడులు సాధించొచ్చని రాయికోడ్ డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ కచురరావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని రైతువేదికలో రాయికోడ్, మునిపల్లి, వట్‌పల్లి మండలాలకు చెందిన ఆత్మ డైరెక్టర్లు రైతులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాయికోడ్, వట్‌పల్లి ఏఈవోలు సారికరెడ్డి, శ్రీనివాస్, అనిత, రైతులు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మినరల్స్ సమపాలల్లో ఉండాలి


నీటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నిజాంపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : మానవ శరీరానికి కావాల్సిన మినరల్స్ సమపాలల్లో ఉండే విధంగా చూసుకోవాలని మిషన్ భగీరథ ఏఈ భిక్షపతి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కాశీపూర్ గ్రామంలో మిషన్ భగీరథ, లోకల్ బోర్, ఫిల్టర్ నీళ్లపై పరీక్షలు నిర్వహించి తగు జాగ్రత్తలు సూచించారు. నీళ్లలో మానవ శరీరానికి కావాల్సిన ఖనిజాల ఆవనాలు ఎక్కువ మోతాదులో ఉన్నాయని, అవి మానవ శరీరానికి మంచిది కాదని, మినరల్స్ సమపాలల్లో ఉండేవిధంగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

కార్ల్‌మార్క్స్ స్ఫూర్తితో పోరాటం : సీపీఎం

సంగారెడ్డి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి) : కార్ల్‌మార్క్స్ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడతామని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. కార్ల్‌మార్క్స్ 207వ జయంతి సందర్భంగా సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్యం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

హత్నూర, మే 5 (ఆంధ్రజ్యోతి) : హత్నూర మండలం దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2005-06లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం మల్కాపూర్ గ్రామ శివారులోని ఓ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఆనాడు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను సన్మానించారు.

'సదుపాయాలు లేని పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలి'

నారాయణఖేడ్, మే 5 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల ప్రకారం సదుపాయాలు లేని పెట్రోల్ బంకులపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గణపతి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాహనాల్లో గాలి నింపడం, మూత్రశాలలు, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించాల్సి ఉండగా ఖేడ్ ప్రాంతంలోని అత్యధిక బంకుల్లో పట్టించుకోవడం లేదన్నారు. మ్యాన్ పవర్ సైతం నిబంధనలకు అనుగుణంగా ఉండటం లేదన్నారు. పనిచేస్తున్న వారికి ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించడం లేదన్నారు. నిబంధనలను విధిగా అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.